దాసు శ్రీరాములు కీర్తనలు

పదములు

001. అంత గీర్వాణము – నేనేరరా స్వామి(అసావేరి –త్రిపుట)
002. అప్పటి మాటలకు – దుప్పటిచ్చె గాని(తోడి – త్రిపుట)
003. ఇంత మోహమా సామి – ఇంత మోహమా(దర్బారు – రూకపం)
004. కట్టివైతునా పడకింటిలో వాని(కాంభోజి – త్రిపుట)
005. కామాంధకారము – కప్పెనా నీవింత(శంకరాభరణము – చాపు)
006. చల్లకు వచ్చి ముంత దా – చ నేలనే ఓమధురవాణీ(బేగడ – రూపకం)
007. తత్తర పడనేల – తాళు తాళురా సామి(కల్యాణి – మిశ్రచాపు)
008. నా మనోధనము జూరగొన్న వి – న్నాణపు దొంగకు మంగళం, నా(సురటి – ఆది)
009. నా సామి నీకిది – న్యాయమా న్యాయమా(అఠాణ – ఆది)
010. నేను నీదాన నా – మేను నీ దేనురా(శంకరాభరణము – ఆది)
011. నేనెరుగనా నీజాడ – నాసామి నేనెరుగనా(దర్బారు – జంపె)
012. పగవారికి నవ్వగ సందే – మగడే నను వేరు జేసెగదే నా(కాఫి – మిశ్రచాపు)
013. పోయి వచ్చెద సామీ – అత్తింటికి(బేగడ – ఆట)
014. మగువ నేనెంత – మంద బుద్ధి నైతి(తోడి – చాపు)
015. మనసు దీరెనా సామి – మనసు దీరెనా సామి(దర్బారు – మిశ్రచాపు)
016. ముంజేతి కంకణ – మ్మున కద్ద మేలనే(సావేరి – రూపకం)
017. ముక్కు పచ్చలారని చిన్నదాన – న(యదుకుల కాంభోజి – త్రిపుట)

018. ముద్దుముద్దుగ పిలవనా – నా సామిని(అఠాణ – చాపు)
019. మూట లడిగితినా – ముల్లె లడిగితినా(యదుకుల కాంభోజి – త్రిపుట)
020. వట్టు బెట్టెద నాచై – పట్టరాకురా సామి(ఆనందభైరవి – చాపు)
21. వలచితిరా నిను – వదలను సామీ(దర్బారు – చాపు)
22. వాడా నిను బంపునవాడా – నను బిల్వ(యదుకుల కాంభోజి – త్రిపుట)
23. వారి వీరి జోలి – నాకేలరా సామి(ద్విజావంతి – మిశ్రచాపు)

జావళీలు

01. అడవి ముష్టికాయ – అది నీకు ప్రియమాయె – అయ్యో నే నేమందురా(ముఖారి – మిశ్రచాపు)
02. ఆ నలిన ముఖి – అందమదేమి(జంఝూటి – ఆది)
03. ఇద్దరి పొందేలరా – సామి దానింటికె పోపోరా(జంఝూటి – ఆది)
04. ఏమని తెల్పుదునే – కోమలి నాభాగ్య(ఫరజు – చాపు)
05. ఏమనెనే కోమలీ – తెలుపవే నీతో(ఫరజు – ఆది)
06. కోపమా సామి యేమిర – కోపమా(కాఫి – చాపు)
07. తగు తగులేరా చిన్న – దాన తాళజాలరా, నా(హిందూస్థాని కాఫి – రూపకం/త్రిశ్రగతి)
08. తెలియదే తెలియదే – తెలియదే మాయ(కాఫి – ఆది)
09. దయలేక నీవురాక యున్న – తాళ జాలరా(కాఫి – రూపక)
10. నను విడనాడుట – న్యాయమా సామి(హిందుస్థానీ భైరవి – ఆది)
11. నా నొసటనే పొడిచె – నా యేమిరా(ఖమాస్ – రూపకం)
12. నిలునిలు మటుండుమీ – నాసామి(ఖమాస్ – ఆది)
13. నీతోటి మాటలు – నాకేలరా సామి(కాఫి – ఆది)
14. నే గననా సామి – నే గననా(కాఫి – చాపు)
15. పాట బాడెద రార సామి – పరమానందమురా, నాసామి(సురటి – రూపకం)
16. పోవోయి పోవోయి – పొలతులతో నింత(కాఫి – ఆట)
17. భామిని రాగదే – సామిని తేగదే(కాఫి – ఆది)
18. మనసిచ్చి నాతో – మాటాడవేమిరా(బేహాగ్ – ఆది)
19. మొట్టమొదట – నట్టనడుమ(జంఝూటి – రూపకం)

పదములు

001. అసావేరి –త్రిపుట

పల్లవి:

అంత గీర్వాణము – నేనేరరా స్వామి
అచ్చతెనుగు జెప్పరా ॥అంత॥

అనుపల్లవి:

వింతగా ననుజూచి – "విరిబోణియవి పూవు
బంతులా యేమని" – పకపక నగియెదవు ॥అంత॥

చరణ:

చాలగా మదన ప్ర – చారములను నే
జాణగాను గదరా
"మేలు వేలుపుప్రోడ – మిద్దెటింటికి జేర
వీలు దెలుపు" మని – వేవేగ ననియెదవు ॥అంత॥

వీరాసనము వైచి – పెదవి పంటను గరచి
తీరుగా కన్నుగీటుచు
"వారిజ ముఖి మంచి – పగడము ముత్యాల
చేరులోనికి దయ – సేయుమీ" అనియెదవు ॥అంత॥

వాలాయముగ తోట్ల – వల్లూరి వేణుగో

పాల నిన్నే నమ్మితి
శీల మొప్పగ "దాసు – శ్రీరామ కవి కృతి
లీలాం శ్రుణు మహిళే" – అని పల్కెదవు ॥అంత॥

002. తోడి – త్రిపుట
పల్లవి:
అప్పటి మాటలకు – దుప్పటిచ్చె గాని
అప్పటి గప్ప నిచ్చెనటే చెలి ॥అప్పటి॥
అనుపల్లవి:
తప్ప నే నితరుల – దరి జేరనని యెన్నో
చెప్పిన తలచు కొంటినే ఓ చెలి ॥అప్పటి॥
చరణ:
తొలినాటి వగలే యా – మరునాటి పగలు మా
చెలిమి కాకియు కో – వెల చందమాయెనే ॥అప్పటి॥
పడతి మగవారి బారు – పడకింట మితిమీరు
గడప దాటిన వెనుక – కారు మన వారు
బడిబడి నాడు వారు – బ్రతిమాలి పాదముల
బడి వేడు కొన్నగాని – పలుకే మేల్మి బంగారు ॥అప్పటి॥
కాసు వీసము లిచ్చి – గోస గూసల మసి
బూసి నేరేడు గాయ – జేసెనే చెలి
వేసాలమారి మా – వేణుగోపాల మూర్తి
దాసు శ్రీరామకవి – డాసి యేలుచుండెనే ఓ చెలి ॥అప్పటి॥

003. దర్బారు – రూకపం
పల్లవి:

ఇంత మోహమా సామి – ఇంత మోహమా
ఇపుడె రావలెన సామి ॥ఇంత॥
చరణ:
అక్కటక్కటా వేగు – చుక్క బొడిచెనో లేదో
కొక్కొరోకో యనుచు తొలి – కోడి గూసెరా
చిక్కియున్న కసర కసర – చీకటిలో నిదురలేక
ఇక్కడకు రానుపోను – యీ ప్రయాసమేల సామి ॥ఇంత॥
జుంటి తేనెలొలుకు దొండ – పంటి వంటి మోవి మీద
గంటు జూడగా యొడలు – మంట లెక్కెరా
ఒంటిగానె వచ్చితివో – వెంటనొకతె యున్నదో
జంట విడవు రేపు దాని – తంటాలేమి యున్నవో ॥ఇంత॥
వినుము తోట్ల వల్లూరి – వేణుగోపాల నీ
కనుల ఎరుపు చెక్కుల నలుపు – గనుగొంటినిరా
నిను నే నొకటన నేటికి – నిజమాడిన నిష్ఠురమే
ఘనుడ దాసు శ్రీరామ – కవి వందిత మునివందిత ॥ఇంత॥

004. కాంభోజి – త్రిపుట
పల్లవి:
కట్టివైతునా పడకింటిలో వాని
బట్టి పైట కొంగున ॥కట్టి॥
అనుపల్లవి:
ఇట్టివాడు వంట – ఇంటి కుందేలాయె
ఎక్కడ బోయే ననుకో రాదమ్మ ॥కట్టి॥
చరణ:
విడచితినా సామి – వీధివీధి తిరిగి

– వేగత్తెల గుడునే
తడబాటులేక చే – తను జిక్కినప్పుడే
చెడనీక పదిలము – చేసుకోవలెనమ్మ ॥కట్టి॥
ఏమరి నేనూరకుంటినా – ఈ రాత్రి
– ఏవేళ కేబుద్ధియో
కోమలమున నింత – గోవగొన్నవాడు
వామాక్షి మనవాడ నమ్మరాదమ్మా ॥కట్టి॥
మోస పోతిని వేణు – గోపాల దేవుని
– బాస నిజము గాదే
దాసు శ్రీరామదాసుని – హృదయము
బాసి గడియయైన – నిలువ నొల్లడమ్మా॥కట్టి॥

005. శంకరాభరణము – చాపు
పల్లవి:
కామాంధకారము – కప్పెనా నీవింత
కనుగానక యుంటివి ॥కామాంధ॥
అనుపల్లవి:
ఏమిరా తెలియదా – ఇది కాదని నీకు
నీముద్దు కోమలి – నివసించిన యిల్లు ॥కామాంధ॥
చరణ:
పంజరమున చిలుక – పగిది నేనుండగ
– పరులకు పనియేమిరా
సంజ చీకటిదారి – జాడ తెలియలేక
కంజాత నయన ఇ – క్కడ వచ్చితివా లేక ॥కామాంధ॥
వగకాడ నీవంటి – వానికి నావంటి

– మగువ పొందది ఏలరా
మొగలి పూజిదుమ బో – ముల్లా కంటిన యట్లు
తగని ఈ నా యిల్లు – దారి దాకెనా లేక ॥కామాంధ॥
భ్రమ లేల నిన్నటి – రాతిరి గలసిన
– భామ ఇల్లిది గాదురా
రమణీయ దాసు శ్రీ – రామ కవీంద్రుని
అమల చిత్తాంబుజ – మనుకొంటివా లేక ॥కామాంధ॥

006. బేగడ – రూపకం

పల్లవి:
చల్లకు వచ్చి ముంత దా – చ నేలనే ఓమధురవాణీ ॥చల్లకు॥
అనుపల్లవి:
ముల్లెకు మోసము లేదు – ముద్దు బెట్టి పొమ్మనే ॥చల్లకు॥
చరణ:
వల్లభ నీవంటి వాని – వలచి వచ్చిన వనిత నేచ
చెల్లదురా తగదు దగదని – చెయ్యి బట్టి రమ్మనె ॥చల్లకు॥
వానికెదురు చూచుచు – వాకిటనే నిలచితినే
చాన యేమొకాని యన్న – పానమునే మరచితినే ॥చల్లకు॥
వేసట జెందితిగదవే – వేణుగోపాలుని దేవే
దాసు రామ కవి హృదయ ని – వాసుని దయచేయుమనే ॥చల్లకు॥

007. కల్యాణి – మిశ్రచాపు

పల్లవి:
తత్తర పడనేల – తాళు తాళురా సామి
అత్తింటి కోడలరా ॥తత్తర॥

అనుపల్లవి:
కొత్తగా నేవచ్చి – కొన్ని నాళ్లాయెరా
పొత్తుగడియ మరచి – పోరు మా వారు
చిత్తమున నేరమెంచకురా – చీకటి వేళగాదురా
అత్తవారింట లేకున్నపు – డైన రావైతివిర సామీ ॥తత్తర॥
చరణ:
మక్కువ చెక్కిలి – నొక్కరాకురా సామి
– నొక్కు లెక్కడ దాతురా
అక్కడ నున్నది – అదిగో యాడు బిడ్డ
ఇక్కథ లెరిగిన – నెగిరి పైబడు సామి
నిక్కముగ నీకె దక్కితిరా – నేటి మాపటికి రాపోరా
పక్కనే పంచాది గది వెల – పటి తలుపు మూయకుంచెదరా ॥తత్తర॥
కౌగిటి కిది వేళ – గాదురా నీకింత
– కక్కుర్తి పని యేమిరా
బాగు బాగు రవిక – బట్టి నీగోళ్ళతో
లాగిన పికిలె నే – లాగు బొంకెదురా
కాగలదురా నీవు కోరిన – కార్యమది యొక జాములోపన
రాగదుర మాపటికి మా లో – గిటికి పడమటి కిటికి దారిని ॥తత్తర॥
వల్లగాదుర తోట్ల – వల్లూరి వేణుగో
– పాల తగదు తగదురా
చల్లని పన్నీరు – చల్లి యత్తరు దేహ
వల్లి బూసెదు మూయ – వశమా వాసనలు
సల్లలిత దాసు రాముని కృతి – నుల్లసిల్లితివిరా మది మన
మల్లగుంతలె వారు చూచిన – నల్లరికి మూలమగు సామి ॥తత్తర॥

008. సురటి – ఆది

పల్లవి:

నా మనోధనము జూరగొన్న వి – న్నాణపు దొంగకు మంగళం, నా
సామికిదే శుభమంగళం – ముద్దు సామికిదే జయమంగళం ॥నా మనో॥

అనుపల్లవి:

ప్రేమతో నా కౌగిట జిక్కి కులుకు – పిసాళి గుబ్బల పోటుల నలసి
పిరివిరిగా ననగి పెనగి మేను – మరపించుచు నేర్పున ॥నా మనో॥

చరణ:

క్రొవ్విన కోవెలలే మావిచిగురు – కొరికిన క్రియ నా వాతెరనొక్కి
నవ్వు మొగంబు నలంకరింపగా – నన విల్తుని బారికి మదిసొక్కి
దవ్వు దవ్వులనె యురికి – మెలమెల్ల దరికి దరికి, డగ్గరి
చివ్వన నను బట్టిన మై ఝల్లని
చిటుకున వీడిన నీవితో నిక్కిన – చిన్ని చన్నుగవ ఠీవితో
మొవ్వపుటరగను మూతతో – మోహపు చెమటల పూతతో
పువ్వుల పాన్పున పొందుగ ననువిడి – పొరిపొరి కాముని పోరున తీరున ॥నా మనో॥

పదరిమదపు టేనుగు తనకరమున – బంగరు టనటుల బట్టిన లీల
వదలక నా పెందొడల వలిప పా – వడ పై కెత్తి సరిగ తనకేల
పొదవి పట్టి కులికి, పొక్కిలి – వెదకి వెదకి కులికి, వెలికి
కదలి సిగ్గుచే కనుమూసుక
బెదరింపున నొక యొరగ నొత్తిల – పదపడి కోరికలూరగా
మదనుడు ములుకుల నూరగా – మదిని వలపు మితిమీరగా
కుదురుగ నా యొడి కుచ్చెల పైనిడి – చెదరక బట్టిన చేతికి మ్రొక్కుచు ॥నా మనో॥

మరిమరి సరసపు మాటలనను బ్రతి – మాలి యెట్టకేలకు జయమంది
తరచుగ రతి కూజితముల చేతన – తమ్మరసము పయ్యెదపై జింది
ద్విరదేంద్రపాలుడు తోట్ల వల్లురి – పురవాసుడు వేణుగోపాలుడు

కరుణను దాసు శ్రీరాముని బ్రోచిన
ఘనుడు కళలు మైదేరగా, నన్ను – గలసి మెలసి తమిదీరగా, నఖ
విరచిత రేఖలు మీరగా, సుఖ – వీచులు పై పై బారగా
సురసుర సొక్కుచు సోలుచు లేచిన – తరి బయ్యర నిలువురమును నిలువగ ॥నా మనో॥

009. అఠాణ – ఆది
పల్లవి:
నా సామి నీకిది – న్యాయమా న్యాయమా
నా సాటివారిలో – నగుబాటు లాయెరా ॥నా సామి॥
చరణ:
సుందరాంగ నిను – జూచినప్పటి నుండి
ఇందన్నము నిద్ర – నేనెరుగ నన్నేలరా
అందరాని మ్రాని పండ్ల – కాసించి నట్లాయె బ్రతు
కెందుకిక నా – యందు దయ రాదేమిరా ॥నా సామి॥
పాటలాధర నిన్ను – పటమున వ్రాసుక
మాటి మాటికి తమి – నాటి చూచుకొనుచు
కాటుక కన్నుల వెంట – దీటుగా జారు కన్నీట
మీటిన విచ్చు గుబ్బలపై – శాటి దడిసె నీ కేటిమాటలు ॥నా సామి॥
వర తోట్ల వల్లూరి – వాసా వేణుగోపాలా
స్థిర శీల ఘన దాసు – శ్రీరామకవి పాల
కరుణలేదాయె నాపై – మరుబారి కోర్వగలనా
సురత సుఖమున నరసి ప్రోవర – చరణములకే శరణుజొచ్చెద ॥నా సామి॥

010. శంకరాభరణము – ఆది
పల్లవి:

నేను నీదాన నా – మేను నీ దేనురా
నీనా సందున – గానడెవాడురా ॥నేను॥
చరణ:
ఎన్నడు నీమాట – కెదురాడనురా
మన్నించి తిన్నగ – మాటాడ వేమిరా ॥నేను॥
ఓరీ నాసామి నే – కోరితిరా నిన్నే
తీరైన గుబ్బల – గోరులుంచ రార ॥నేను॥
భాసుర వేణుగో – పాల దయాళవాల
దాసు శ్రీరాముని – దయనేల వదేల ॥నేను॥

011. దర్బారు – జంపె
పల్లవి:
నేనెరుగనా నీజాడ – నాసామి నేనెరుగనా ॥నే॥
అనుపల్లవి:
మాను నీ వగలెల్ల – మావద్దనా సామి ॥నే॥
చరణ:
మరుపెన్నటికి రాని – మంచి మాటలె చెప్పి
అరచేత వైకుంఠ మట్టిచూపి
పరిపూర్ణ దయ గలిగి – పనులెల్ల కానిచ్చి
సరసుడవు నీ వింద్ర జాలములు చేసేవు ॥నే॥
ముద్దు నాసామి నీ – మురిపంపు సుద్దులివి
ముత్యాలు పదివేలు – మూటగట్టు
బద్దులాడను పంచ – బాణుడాన నీవలపు
మిద్దె పై నిడుపరుగు – మీసాలపై తేనె ॥నే॥
కనికరము పూజ్య మా – కాశ పుష్పము నిజము

వినవోయి మగవారి – వింతలెల్ల
ఘనదాసు శ్రీరామ – కవికీర్తనంబులే
విన వేడుకాయె నీ – పని పదిల మాయెనిక ॥నే॥

012. కాఫి – మిశ్రచాపు
పల్లవి:
పగవారికి నవ్వగ సందే – మగడే నను వేరు జేసెగదే నా
మగడే నను వేరు జేసెగదే ॥పగవారికి॥
చరణ:
వినవే తనమో – మున ముద్దిడ బోయిన వద్దని దిగ్గున లేచెనయో
ఎనసి ముద్దిడరాదటే ఇది వాదటే
మనసులో దయలేదుగా – ముమ్మాటికి
ఇక మాటలేమిటికి ॥పగవారికి॥
కలనా మరుకోలలనొ యెడ గు – బ్బల నాగగలనా లలనా
వలచి చేరిన నేరమా – పెరవారమా
చెలియ నాతో నలుక – లేటికి చెల్లబో నేనేటికి ॥పగవారికి॥
వర తోటల వల్లూరి వేణుగోపాలా – కరుణారసకలిత సుకలిత
భరిత దాస్వభిరాముని – శ్రీరాముని
సరస సమ్మత చరితుడాయెనే – సామిని నేమందునే ॥పగవారికి॥

013. బేగడ – ఆట
పల్లవి:
పోయి వచ్చెద సామీ – అత్తింటికి
పోయి వచ్చెద సామీ ॥పోయి॥
అనుపల్లవి:

హా యేమి సేతు న – న్యాయముగా మన
నీయెడలను దైవ – మెడ బాపె నయ్యయో ॥పోయి॥
చరణ:
మరచిపోక యుండుమీ – యెన్నటికి
– మనము చేసిన చెలిమి
హరిహరి నిద్రాహారము లెరుగక
దరి లేని విరహసా – గరమున నీదుచు ॥పోయి॥
బడిబడి నెంతో తమి – కోరకు మీ
– పడచుకత్తెల కూరిమి
ఎడలేక కన్నీరు – విడువనేలర సామి
తడవు లేదెట్లయిన – తప్పించి రాలేనా ॥పోయి॥
ఘన వేణు గోపాలా – దాసు శ్రీరామ
– కవిపాలా మృదుశీలా
మనసు రాయి జేసు – కొని యెట్లు నిలుతు నా
తనువునీదే సుమ్మి – దయయుంచు నామీద ॥పోయి॥

014. తోడి – చాపు
పల్లవి:
మగువ నేనెంత – మంద బుద్ధి నైతి
మగని తూలనాడితి – మోస పోయితి ॥మగువ॥
అనుపల్లవి:
తెగువ తొల్లి యిల్లు – తిరిగి చూచుచున్న
నగధర నినుజూచి – నగరా పొమ్మంటి ॥మగువ॥
చరణ:
బెట్టు విడచి మ్రొక్కు – బెట్టు వచ్చిన నన్ను

బట్టకురా నీ – బవిసి దెలిసె నంటి ॥మగువ॥
వాసిగా నాతోడ – యూసులాడెదనన్న
దాసు శ్రీరామ కవి – డాసి ఏలుకొమ్మంటి ॥మగువ॥

015. దర్బారు – మిశ్రచాపు
పల్లవి:
మనసు దీరెనా సామి – మనసు దీరెనా సామి
వనజాక్ష దాని పొందు – వైకుంఠ మాయెనా ॥మనసు॥
చరణ:
మరుగు పరచ నేటికిరా – మంచిది లేరా
మెరుగు బోణి వగలు – తిరుమంత్రము లాయెనా ॥మనసు॥
చొక్కియున్న జాడలు – చూచిన చాలు దాని
ప్రక్క బండి యుండుటే – బ్రహ్మానంద మాయెనా ॥మనసు॥
వినుము తోట్ల వల్లూరి – వేణుగోపాల శౌరి
ఘనుడు దాసు శ్రీరామ – కవి సన్నుతి జేసెనా ॥మనసు॥

016. సావేరి – రూపకం
పల్లవి:
ముంజేతి కంకణ – మ్మున కద్ద మేలనే
రంజిల్లు వాని గుణము – రమణి మన మెరుగమే ॥ముంజేతి॥
చరణ:
కమ్మదనపు మాటలనె – కడుపులోనొక విధమె
కొమ్మవాని వలపు ని – క్కమ్ముగాదె నమ్మరాదె ॥ముంజేతి॥
మాటలును చేతలును – మనవద్దనే చెలియ
మాటికి పడకలా – మగువతోడ తగవదేడ ॥ముంజేతి॥

భాసురాంగి నన్నుమాయ – జేసె నేనేమి సేతు
దాసురామకవి మనోని – వాసుడాయె మోసమాయె ॥ముంజేతి॥

017. యదుకుల కాంభోజి – త్రిపుట
పల్లవి:
ముక్కు పచ్చలారని చిన్నదాన – న
న్నెక్కడి కంపెదరే – సిగ్గాయె న
న్నెక్కడి కంపెదరే ॥ముక్కు॥
అనుపల్లవి:
నిక్కము రేయెల్ల – నిదుర బోయెద నమ్మా
తక్కిన పనులేమి – నేనెరుగనో యమ్మా ॥ముక్కు॥
చరణ:
వంచిన నాచేయి – మంచి గంధములోన
ముంచి యెత్తెదరేలనే – సిగ్గాయె నన్నెక్కడి కంపెదరే
మంచిదేరమ్మ – మగవారి చేయిబట్టు
మంచు దెల్పెదరు నా – కలవాటు లేదమ్మా ॥ముక్కు॥
అందముగా సున్న – మాకీనె దీసి నే
– నంటరాయ నేరనే
అందగాని నోటి – కందీయ మనియెద
రిందరిలో మన సెట్టు – లొప్పునోయమ్మా ॥ముక్కు॥
ఈ పనులా పను – లేల చెప్పెదరు నే
– నేపని కోపలేనే
ప్రాపై దాసుశ్రీ – రాము నేలిన వేణు
గోపాల దేవుని – గూడి యుండెదనమ్మా ॥ముక్కు॥

018. అఠాణ – చాపు

పల్లవి:

ముద్దుముద్దుగ పిలవనా – నా సామిని
ముదుగు ముదుగుగ పిలువనా – నా సామిని ॥ముద్దు॥

అనుపల్లవి:

ముద్దు ముద్దుగ పిలువ – చులక సేయునేమో
ముదుగు ముదుగున పిలువ – బాగని తోచేనే ॥ముద్దు॥

చరణ:

పాటలు పాడుదునా – మంచి ఆటలు ఆడుదునా
వాటమైన గుబ్బ – పోటు జూపింతునా
గోటి కొన చెక్కిలి – మీటుదునా ॥ముద్దు॥
ఆకు మడుపు లిత్తునా – మంచి తావి
అత్తరు పై బూతునా
తేకువతో జడ – త్రిప్పి కొట్టుదునా
మోకమోవి చిగురు – మోవి గరతునా ॥ముద్దు॥
కోపగించకు మందునా – యేర వేణు
గోపాల రమ్మందునా
శ్రీపూర్ణమగు దాసు – శ్రీరాము మనమున
ప్రాపై నివసించి – పాలించమందునా ॥ముద్దు॥

019. యదుకుల కాంభోజి – త్రిపుట

పల్లవి:

మూట లడిగితినా – ముల్లె లడిగితినా
మూతి త్రిప్పెద వేమిరా – ముద్దిడరా
మోము త్రిప్పెదవేమిరా ॥మూట॥

అనుపల్లవి:
నోటి మాటకైన – నోచుకో నైతినా
కూటములా ముద్దు – కోమలి పాలైన ॥మూట॥
చరణ:
త్యాగశీలుడ వీవు – దాచిన సొమ్మంత
వేగ నాకిమ్మంటినా
బాగాలివ్వనైన – పనికి రానైతినా
బాగాయె నది యెంత – బంగారు బొమ్మైన ॥మూట॥
వడిగ నే నీ పాన్పు – వద్దకు జేరగ
వద్దు వద్దన నేలరా
అడుగులొత్తగ నైన – అనుకూల పడరాదా
పడతి బోధన లిహ – పర సాధనములైన ॥మూట॥
పాలించు శ్రీ తోట్ల – వల్లూరి వేణుగో
పాలా మ్రొక్కితి మ్రొక్కితి
శ్రీల మించిన దాసు – శ్రీరామ కవి కృతి
వాలాయముగ నిన్ను – వర్ణన జేసిన ॥మూట॥

020. ఆనందభైరవి – చాపు
పల్లవి:
వట్టు బెట్టెద నాచై – పట్టరాకురా సామి ॥వట్టు॥
అనుపల్లవి:
గట్టిగ పదివేల – కరకు వరాల మూట
గట్టి నా కట్టెదుట – బెట్టి మాటాడర ॥వట్టు॥
చరణ:
గారాన నొక యమ్మ – కని పెంచిన బిడ్డ

యూరకే వచ్చునా – తేరా సరిగ చీర ॥వట్టు॥
వలచి వచ్చినవారు – విలువ బెట్టకపోరు
అలరింతు తేరా మంచి – ఆణి ముత్యాల పేరు ॥వట్టు॥
భాసుర వేణుగో – పాల జేజేల మిన్న
దాసు శ్రీరామకవి – డాసి ఏలక యున్న॥వట్టు॥

021. దర్బారు – చాపు
పల్లవి:
వలచితిరా నిను – వదలను సామీ
జలజాక్ష నీ ద – ర్శనమే పదివేలు ॥వలచితి॥
చరణ:
ఇచ్చిన సరే – ఇవ్వకున్న సరే
వచ్చి నాతో నొక – ముచ్చటాడిన చాలు ॥వలచి॥
నీళ్లనే ముంచు – పాలనే ముంచు
కాళ్లకు మ్రొక్కెద – కరుణించరా ॥వలచి॥
వేణుగోపాలా – వేడితి చాలా
రాణించు దాసు శ్రీ – రాము నుల్లము వలె ॥వలచి॥

022. యదుకుల కాంభోజి – త్రిపుట
పల్లవి:
వాడా నిను బంపునవాడా – నను బిల్వ
వనిత నే రాననవే – పోపోవే ॥వాడా॥
చరణ:
చింతలేల వాడు – చీటీ బంపెనా
సంతోషమే యనవే – పోపోవే ॥వాడా॥

చిన్ననాటి నుండి – చేసిన తన తోడి
చెలిమి చాలు ననవే – పోపోవే ॥వాడా॥
కోపమేటికి తోట్ల – వల్లూరి శ్రీవేణు
గోపాలా దగుననవే – పోపోవే ॥వాడా॥
వేయేల దాసు శ్రీ – రామ హృదయవాసి
వై యుండుమీ యనవే – పోపోవే ॥వాడా॥

023. ద్విజావంతి – మిశ్రచాపు
పల్లవి:
వారి వీరి జోలి – నాకేలరా సామి
వద్దు వద్దు చాలురా ॥వారి॥
అనుపల్లవి:
నోరు మూసుకొని – యూరకున్న గాని
తీరదాయె దాని – పోరు నేనేమి సేతు ॥వారి॥
చరణ:
అల దానితో నీవు – కలసి కులుకుచున్న
– నదె నాకు పదివేలురా
వలపు నాపై నీకు – కలుగ కున్న నేమి
తొలి నోము ఫలమని – తలచితినే కాని ॥వారి॥
వలవల కన్నీరు – వరదలై పారగా
– తల వ్రాసెగా దైవము
నిలచి నీతో నింక – పలుకు లేమిటికిరా
అలరు తేనియ విస – మైన గ్రోలెద గాని ॥వారి॥
వారక శ్రీతోట్ల – వల్లూరి వేణుగో
– పాలా మ్రొక్కెద మ్రొక్కెద

ధీరుడైన దాసు – శ్రీరామ కవి కృతి
సారమైన విని – సామి నన్నేలరా ॥వారి॥

జావళీలు

01. ముఖారి – మిశ్రచాపు
పల్లవి:
అడవి ముష్టికాయ – అది నీకు ప్రియమాయె – అయ్యో నే నేమందురా ॥అడవి॥
అనుపల్లవి:
పడుచుతనము చేత – భ్రమజెందుటేగాని – పదరా నీలి వార్త ॥అడవి॥
చరణ:
వింత వింతల మారి – సంతమెరుగులాడి – తంతర గొట్టుదిరా
సంతోషమున దాని – సరస జేరుటేగాని
ఇంతి మంతనములు – యెండమావుల నీళ్లు ॥అడవి॥
చేసితివౌ లేర – చెలియతో స్నేహము – చేతి సంచి వెచ్చము
ఆసచేత దాని – నంట బోవుటేకాని
కాసు చేయదు వట్టి – కట్టు గారడి సామి ॥అడవి॥
కోప మెంచకు తోట్ల – వల్లూరి శ్రీవేణుగోపాలా బాగాయెరా
శ్రీపూర్ణుడగు దాసు – శ్రీరామకవి వాక్య
వ్యాపారములు వే – దాక్షరములు నమ్ము ॥అడవి॥

02. జంఝూటి – ఆది
పల్లవి:
ఆ నలిన ముఖి – అందమదేమి
దానికి నీకు – తగుసామి ॥ఆ॥

చరణ:

మందుల మారుల – మాపసగడె

బందములాయె – బళిబళిసామి॥ఆ॥

తంతర గత్తెల – తక్కులు మిగుల

సంతసమాయె – సరిసరి సామి ॥ఆ॥

03. జంఝూటి – ఆది

పల్లవి:

ఇద్దరి పొందేలరా – సామి దానింటికె పోపోరా ॥ఇద్దరి॥

అనుపల్లవి:

సద్దేల జేసేవు – సామి నే నోర్వ నా

వద్దకు నీవు రా – వద్దుర వద్దుర ॥ఇద్దరి॥

చరణ:

నా జోలి నీకేలరా ఆబ్రహ్మ – నిన్నెట్లు పుట్టించెరా

ఏ జాము దానింట – నీజాడ నేజూడ

బేజారు గాజాల – నేజెల్ల నేజెల్ల ॥ఇద్దరి॥

కన్నుల ఎరుపేమిరా చెక్కుల – కాటుక నలుపేమిరా

కన్నుల విలుకాని – కయ్యాల మెలగిన

చిన్నెలే తోచెరా – చెప్పరా చెప్పరా ॥ఇద్దరి॥

శ్రీపూర్ణ తోట్ల వల్లూరిపుర – వేణుగోపాల బాగాయె

రాపేల దాసు శ్రీ – రామకవిపాల

ఈ పట్ల నీపను – లింతాయె వింతాయె ॥ఇద్దరి॥

04. ఘరజు – చాపు

పల్లవి:

ఏమని తెల్పుదునే – కోమలి నాభాగ్య
మేమని తెల్పుదునే – నా ముద్దుసామికి
నామీద ప్రేమ ॥నేమని॥
చరణ:
చెక్కిలి ముద్దాడెనే – చక్కని నాసామి
చెక్కిలి ముద్దాడెనే
నిక్కముగ నిన్నరేయి – ప్రక్కనే పవ్వళించి
చక్కని కెమ్మోవి నొక్కెనే ॥ఏమని॥
బాళిచే నన్నేలెనే – కేళిలో నాసామి
బాళిచే నన్నేలెనే
వేళగదే రారమ్మని – విలువగల సొమ్ములిచ్చి
చాలగా లాలించెనే – సోలెనే బాల నే ॥నేమని॥
నాసాటి పేరనెనే – వేణుగోపాలుడు
నాసాటి పేరనెనే
ఆసదీర్చి రామ – దాసకవి చిత్త
వాసుడాయె పూసెనే గంధము – చేసెనే బాస నే ॥నేమని॥

05. ఫరజు – ఆది
పల్లవి:
ఏమనెనే కోమలీ – తెలుపవే నీతో
ఏమనెనే కోమలీ– తెలుపవే నీతో ॥నేమనెనే॥
చరణ:
అంగజు బారికి – నిలువ దరమటే
మంగళవార్తలు – మరియేమి నీతో ॥నేమనెనే॥
మోహ పయోధిలో – మునిగితినిక నే

యూహలు సేయుదు – నొకసారి నీతో ॥నేమనెనే॥
దాసు శ్రీరామ – కవి గీతసుధా
దాసుడైన హరి – దయచేసి నీతో ॥నేమనెనే॥

06. కాఫి – చాపు
పల్లవి:
కోపమా సామి యేమిర – కోపమా ॥కోపమా॥
అనుపల్లవి:
ఆపరాదుర మోహము పరి – తాప మందెర దేహము, నను
రాపు జేయుట ద్రోహము నీ – రూపమైన జూపవేమిర ॥కోపమా॥
చరణ:
వాదమా సామి నాతో – వాదమా
లేదురా బలవంతము – ఇదికాదురా యొక పంతము, సడి
రాదురా అత్యంతము నీ – మీది తమితో నేమి తోచదు ॥కోపమా॥
వీడరా మోడి నాపై – వీడరా
ఆడుదానిరా దోసము కా – పాడరా పరిహాసము, నిను
గూడని నావేసము మా – టాడనైన గూడదటరా॥కోపమా॥
దోసమా సామి నాపై – దోసమా
...
... ||కోపమా॥

07. హిందూస్థాని కాఫి – రూపకం/త్రిశ్రగతి
పల్లవి:
తగు తగులేరా చిన్న – దాన తాళజాలరా, నా
తోను పంతమేలరా యిం – తైన నిల్వలేనురా ॥తగు॥

చరణ:

నను గరుణింపవేర – న్యాయమరసి చూడరా, నా

మీద కోపమేలరా నీ – కేల రవ్వ మానరా ॥తగు॥

కోమలమగు నాదు వయసు – కోన వెన్నెలాయెరా, నా

గుట్టు బయలు బట్టెరా – నా కోరిక లీడేర్చరా ॥తగు॥

వేసకాడ ముద్దుసామి – వేణుగోపబాలకా, శ్రీ

దాసురామపాలకా నా – పాలి పంచనాయకా ॥తగు॥

08. కాఫి – ఆది

పల్లవి:

తెలియదే తెలియదే – తెలియదే మాయ ॥తెలియదే॥

అనుపల్లవి:

వలపు సొలపులో – వాని గుణమేమొ కాని ॥తెలియదే॥

చరణ:

వలపించుటే కాని – వలచుటలేదే దాని

కలనైన మరువడే – కానిపని చేసినాడే ॥తెలియదే॥

చెలియరో నే మందు – బలమగు దానిమందు

తల కెక్కెనేమో అందు – వలన రాడే యిందు ॥తెలియదే॥

వేమరు ననుగూడి రాడు – వింతమాట లాడినాడు

భామరో దాసు శ్రీరామ – పాలుడే గోపాలుడే ॥తెలియదే॥

09. కాఫి – రూపక

పల్లవి:

దయలేక నీవురాక యున్న – తాళ జాలరా ॥దయలేక॥

చరణ:

నిన్నరేయి కన్నులార – నిదుర లేదురా
వన్నెకాడ నిదురలేక – వాచియుంటిరా ॥దయలేక॥
ఉత్తమాటగాదు నిన్నె – గుత్త గొంటిరా
చిత్తగించు నాదు మనవి – చిత్తగించరా ॥దయలేక॥
శ్రీసఖా నే జేసుకొన్న – దోస మేమిరా
వాసిమీర దాసురామ – దాసు నేలరా ॥దయలేక॥

10. హిందుస్థానీ భైరవి – ఆది
పల్లవి:
నను విడనాడుట – న్యాయమా సామి
న్యాయమా సామి – న్యాయమా సామి ॥నను॥
చరణ:
కనికర మేల లేదు – కారణ మేమిర
కారణ మేమిర – కారణ మేమిర ॥నను॥
నను మరుబారి ద్రోయ – న్యాయమా సామి
న్యాయమా సామి – న్యాయమా సామి ॥నను॥
విను తోట్లవల్లూరి – వేణుగోపాల
వేణుగోపాలా – వేణుగోపాలా ॥నను॥
ఘన దాసు రామావన – కరుణింప వేమిరా
కరుణింప వేమిరా – కరుణింప వేమిరా॥నను॥

11. ఖమాస్ – రూపకం
పల్లవి:
నా నొసటనే పొడిచె – నా యేమిరా ॥నా నొసట॥
అనుపల్లవి:

నానా వర వర్ణినులకు – నావలె కామము లేదా ॥నా నొసట॥

చరణ:

పరమ శివునొదల గంగా – భామలేదా

పరమేష్ఠి ముఖమున సర – స్వతి వసించలేదా ॥నా నొసట॥

దామోదరు రొమ్మున లే – దా ఇందిర

కామాక్షి హరునర్ధాం – గమున బెనుగొనలేదా ॥నా నొసట॥

నా వేణుగోపాల – నన్నేలరాదా

శ్రీవిలసిత శ్రీదాసు – శ్రీరామకవి వరదా ॥నా నొసట॥

12. ఖమాస్ – ఆది

పల్లవి:

నిలునిలు మటుండుమీ – నాసామి

నీవు నాదరి రాకుమీ – నాసామి ॥నిలు॥

చరణ:

ఆ మాయలాడి – ఏమి బోధించెరా

సామి నాకు దెల్పరా – సంశయమేమిరా ॥నిలు॥

సన్నుతాంగిని గూడి – నాసాటి వారిలో

నన్ను రద్ది జేయుట – న్యాయము గాదుర ॥నిలు॥

వేసగాడవుగద – వేణుగోపాలసామి

దాసుశ్రీరామకవిని – ధన్యుని జేయర ॥నిలు॥

13. కాఫి – ఆది

పల్లవి:

నీతోటి మాటలు – నాకేలరా సామి

నాతోటి మాటలు – నీకేలరా ॥నీతోటి॥

అనుపల్లవి:
నే తాళ దానితో – ఖాతాలు నీకేల
ప్రీతిగల నాతియని – పోతివి రాతిరి ॥నీతోటి॥
చరణ:
పరువటరా నాతో – పనులేమిరా సామి
పరువటరా నాతో – పనులేమిరా
విరజాజి బంతులు – విసరకురా సామి
సరసము విరసమౌ – చాలుర చాలుర ॥నీతోటి॥
ఒయ్యార మిదియేమి – ఊరుకోరా సామి
ఒయ్యార మిదియేమి – ఊరుకోరా
ఉయ్యాల మంచము – నూచకురా సామి
అయ్యది గయ్యాళి – అయ్యయో అయ్యయో ॥నీతోటి॥
వేసమా వల్లూరి – వేణుగోపాలా సామి
వేసమా వల్లూరి – వేణుగోపాలా
దాసు శ్రీరాముని – భాసుర వాక్యము
చేసెరా వేయివేలు – సేబాసు సేబాసు ॥నీతోటి॥

14. కాఫి – చాపు
పల్లవి:
నే గననా సామి – నే గననా
శ్రీగల వాడవు నీవని – చిన్నతనము సుందరుండవని
కౌగిట నేను బదినాలుగు విధముల – గరడీలు గరపినది ॥నే॥
చరణ:
వేడుక కాడవు నీవని – వీధిలో నినుగని పోకుమని
కోడెకాడ రారమ్మని – కోడిగము లాడినది ॥నే॥

చక్కని వాడవు నీవని – చనవుగలదు వెరపేమి యని
చక్కిలి గింతలు గొలుపుచు మోవి చు – రుక్కున నొక్కినది ॥నే॥
వాసిగ వల్లూరి వాసుడని – భాసుర వేణుగోపాలుడని
దాసు రామకవిపాలుడని దర – హాసము జేసినది ॥నే॥

15. సురటి – రూపకం
పల్లవి:
పాట బాడెద రార సామి – పరమానందమురా, నాసామి
బ్రహ్మానందమురా నాసామి – పరమానందమురా ॥పాట॥
చరణ:
మదన జనక నీదు దయ – మదినిగోరి యున్నదాన
ముదముమీర ముచ్చటాడి – ముద్దుబెట్టరా, నాసామి
ముద్దుబెట్టరా నాసామి ॥పాట॥
వలపు నిలుప లేదురా – వగలుమాని యేలుకోర
కళలుదేర నొక్కసారి – కౌగిలించరా, నాసామి
కౌగిలించరా నాసామి ॥పాట॥
వనజనయన నిశ్చలా – వరద వేణుగోపబాల
ఘనుడ దాసు రామపాల – కాంక్షదీర్చరా, నాసామి
కాంక్షదీర్చరా నాసామి ॥పాట॥

16. కాఫి – ఆట
పల్లవి:
పోవోయి పోవోయి – పొలతులతో నింత
– పోటాపోటీ లేమోయి ॥పోవోయి॥
అనుపల్లవి:

వావిని ఈవాడ – వనితలెల్ల నీకు
వావారే వావారే – వదిన మరదళ్లైరి ॥పోవోయి॥
చరణ:
తల తడిపి తగని బా – సలు జేసిన నమ్మ
– దగిన కాలము గాదురా
చెలువుడ మన యూరి – వెలయాంద్రతో నీకు
భళిభళి భళీభళి – బహరీ ఖాతాలాయె ॥పోవోయి॥
వేషభాషలు జూపి – విషము చక్కెర జేసి
– విడుతురోయి పురుషులు
హాషామాషీ చెలి – యల సయ్యాటలు నీకు
భేషు భేషు భేషు – విజయ బిరుదములాయె ॥పోవోయి॥
బహురూపధర తోట్ల – వల్లూరి వేణుగోపాలా
– యెంత జాణవు
రహి మించు దాసు శ్రీ – రాముని పలుకులు
అహ హాహా అహా అహా – అమృత బిందువులాయె ॥పోవోయి॥

17. కాఫి – ఆది
పల్లవి:
భామిని రాగదే – సామిని తేగదే
కాముని బారికి – తాళుదునే
తాళుదునే – తాళుదునే ఆ
కాముని బారికి – తాళుదునే ॥భామిని॥
చరణ:
నిన్న మొన్న గూడిన చెలిపై – మోహము నిండారగ
నన్ను మరచెను గదలే – మదవతీ

తాళుదునే యెటు – తాళుదునే ఆ
వెన్నెల కాకకు – తాళుదునే ॥భామిని॥
చెల్లబోనా సాటి – చెలులలో
చిన్నతనం – బాయెనే
మొల్ల విరులమీద – మెల్లని యీ
చల్లని గాలికి – తాళుదునే
తాళుదునే నేనెటు – తాళుదునే ఈ
చల్లని గాలికి – తాళుదునే ॥భామిని॥
ప్రేమమీర దాసు – కులజుడౌ
రామ కవీంద్రుని – బ్రోచెనే
సామజ వరదుం – డలిగెనే
ఆమని ధాకకు – తాళుదునే ॥భామిని॥

18. బేహాగ్ – ఆది
పల్లవి:
మనసిచ్చి నాతో – మాటాడవేమిరా ॥మనసిచ్చి॥
చరణ:
మనవి వినరాదా – మమతింత లేదా
మునుపటి చెలిమికాదా – మోదముకాదా ॥మనసిచ్చి॥
విను నేను బాల – విడనాడ మేలా
చనవుంచుమీ చాల – జాలమిదేలా ॥మనసిచ్చి॥
వర దాసుశ్రీరామా – వనసుగుణధామా
శరణు నన్నేలు ప్రేమ – శ్యామాభిరామా॥మనసిచ్చి॥

19. జంఝూటి – రూపకం

పల్లవి:
మొట్టమొదట – నట్టనడుమ
తుట్ట తుదియు – నెరుగనే
ఇట్టెవచ్చి విభుడు రాత్రి – ఏమిపనులు చేసెనే ॥మొట్ట॥
చరణ:
మోము మోము గదియ విభుడు – ముద్దుపెట్టి నంతలో
భామ యేమొకాని నేను – పరవశమై యుంటినే॥మొట్ట॥
అట్టె విభుడు చన్నుదోయి – బట్ట వచ్చినంతనే
యెట్టి మాయయేమొ నాదు – హృదయ మైక్యమయ్యెనే ॥మొట్ట॥
భాసుర శ్రీవేణుగోప – బాలుడంటినంతనే
దాసురామదాస చిత్త – వాసి యనుకొంటినే ॥మొట్ట॥

20. కానడ – రూపకం
పల్లవి:
రమణిరో సముఖాన – రాయబార మేటికే
నిమిషమైన తాళలేనె – నేనె వాని రమ్మందునె ॥రమణిరో॥
చరణ:
కడువేడుక వానిమేన – గంధమును బూసి యాకు
మడుపులిచ్చి తడవేటికి – మాపటికి రమ్మందునె ॥రమణిరో॥
కోరివానిజేరి ప – న్నీరుజల్లి నన్ను
వేరుసేయ మేరగాదు – వేవేగ రమ్మందునె ॥రమణిరో॥
భాసురాంగి వేణుగో – పాల యింత పంతమేల
దాసు రామకవి సన్నుతి – జేసె నిక రమ్మందునె ॥రమణిరో॥

21. ఖమాస్ – ఆది

పల్లవి:
వగకాడ తగదిక రారా
మగువ నేచుట – మంచిదటరా ॥వగకాడ॥
చరణ:
కృపలేదా – సామి నామీద
ఉపరతి సుఖమున – నోలలాడించెద ॥వగకాడ॥
వినవేర – వేణుగోపాలా
మనసున నీకుగల – మర్మము దెలుపర ॥వగకాడ॥
పసిబాల – తాళజాలర
రసిక దాసు శ్రీ – రాము నేలుకోరా ॥వగకాడ॥

22. ఫరజు – చాపు
పల్లవి:
వద్దు వద్దుర ఇక – వదలరా సామి
పొద్దు పోయెరా నీ – పుణ్యము పోపోరా ॥వద్దు॥
చరణ:
కోపగించకు మగని – కోత కోర్వను సామి
రేపు వచ్చెద చాల – సేపాయె పోపోర ॥వద్దు॥
కంటగించకు నే – గానా నీదాన సామి
యింటికి పోవలె – నిప్పుడే పోపోరా ॥వద్దు॥
వినుమ నా మనవి – వేణుగోపాలా
ఘన దాసు శ్రీరామ – కవిపాల పోపోర ॥వద్దు॥

23. ఆనందభైరవి – రూపకం
పల్లవి:

వనితరో యీా వన్నె – లేలనే ఈ వేళనాకు
తనువేల తరుణులేల – ధనమేల ధామమేల ॥వనిత॥
చరణ:
ఆకులేల పోకలేల – అన్నమేల పానమేల
శ్రీకరుండు రాకయుండి – ఆశలుడిగి యున్నవేళ ॥వనిత॥
సొగసేల సొమ్ములేల – అగరేల గంధమేల
మగనికి దయలేక మేను – సగమై యున్నట్టివేళ ॥వనిత॥
భాసురాంగి తోటలేల – పాటలేల ఆటలేల
దాసు రామ పాలు బాసి – ఆసలుడిగి యున్నవేళ ॥వనిత॥

24. కాఫి – ఆది
పల్లవి:
సరిసరిలే మంచిది
మరుశరములకు బె – దరి దరి జేరినది ॥సరి సరి॥
అనుపల్లవి:
అరమరిక లేమిరా – అరమరిక లేమిరా॥సరి సరి॥
చరణ:
పలుమరు నే నిను – బ్రతిమాలితి నని
పాటింపరా వేణు – గోపాలా
కలకాలంబును – ఘనమా ఇది ॥సరి సరి॥
మ్రొక్కగ వచ్చిన – మోడి సేతువురా
మోహన రూపా – వేణుగోపాలా
దక్కితిరా దాసు – శ్రీరామపాలా ॥సరి సరి॥